# సంబంధం కుదిరింది

'ఏవిటే అమ్మా! అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?' అని అడిగాడు నా కొడుకు.

'బహుశా వంకాయ పచ్చడి చేసి బీరకాయ కూరొండటమా లేకపోతే వంకాయ కూర చేసి బీరకాయని పచ్చడి చేయడమా! అని అయి వుంటుంది" అని కోడలుగారు జవాబిచ్చింది.

'నా తల్లే! ఎంత బాగా చెప్పావు! నిన్న మీరిద్దరూ రాత్రి భోజనం ఇంట్లో చేస్తామో చెయ్యమో తెలియదు. కాస్త అటు ఇటుగా వండమంటే - ఆ పని చేసి బల్ల మీద పెట్టా గదా! మరి అవి మీరు వేలేసి ముట్టుకోకుండా వది లేశారు. ఇప్పుడా అన్నాన్ని పులిహారచేసి నీకు బాక్సులో పెట్టనా, లేకపోతె పెరుగేసి కలిపి రాత్రికి తినేందుకు వీలుగా ఫ్రిజ్జ్‌లో పెట్టనా! అని ఆలోచిస్తున్నా తెలిసిందా?'

'ఏదైనా చేసుకో! మేం ఇద్దరం పెళ్ళికి వెడుతున్నాం. బాక్సక్కరలేదు!' అని కోడలుపిల్లా, 'అమ్మా నీకు ఇంక ఈ సమస్యలుండకుండా మేం వారానికి సరిపడే ప్రోగ్రాం ముందే చెప్పెయ్యదల్చుకున్నాం' అని దాని మొగుడూ అన్నారు.

'అమ్మయ్య! ఇన్నాళ్టి నించి పోరగా పోరగా ఇప్పటికి మీకు కాస్త కష్టం సుఖం తెలుస్తున్నాయన్న మాట. అయినా అసలు వీడిపాటికి వీడ్నుండనిస్తే ఒక్కనాడు నన్ను విసిగించడు! ఈ మధ్యనే మరీ ఇలా.'

'అలాగే పాపం! ఇదిగో! చెప్పు నాయనా మీ అమ్మకి నీ ఈ వారపు ప్రోగ్రాం. నువ్వెప్పుడూ బుద్ధిమంతుడివేనని తెగ మురిసిపోతోంది' అని కోడలు ఎదురుగా నేనొకత్తినున్నానన్న భయమే లేకుండా వాడ్నో మొట్టుమొట్టింది.

కాదే! ఈ వేళ సోమవారం కదా! మాకు గురు, శుక్ర, ఆదివారాలలో తొమ్మిదికల్లా వంటైపోవాలి!'

'ఇంకా చదువులవలేదా? ఏవన్నా కంప్యూటరు క్లాసులా?'

'ఏదో ఒకటనుకో! గురువారం 22 ఆలుపరాఠాలు, శుక్రవారం 33 పెస రట్లు, ఆదివారం పదకొండు పలావు పాకెట్లు తొమ్మిదికల్లా మాకిచ్చెయ్యి.'

'మనదేవన్నా ఇల్లా? మెస్సా? ఈ మల్టిపుల్స్ ఆఫ్ పదకొండేవిటి? మీరే మయినా క్రికెట్ టీమ్‌కి లంచ్ సప్లయి చేసేందుకు ఒప్పుకున్నారా? ఇంట్లో తిండి తింటారో తినరో చెప్పేడవండ్రా అంటే ఇదా చెప్పడం!' ఈ కొంపలో అమ్మ కం అత్త రోల్ యాక్ట్ చేయడం కన్నా ఏదైనా స్టార్ హోటల్లో వంట చేసు కోవడం సుఖంగా ఉండేటట్లుంది.'

'ఎప్పుడూ నువ్వు ముందు తెలిస్తే చేసేదాన్ని అని అంటుంటావు కదాని చెప్పాంగానీ లేకపోతే హాయిగా ఎక్కడైనా మంచిచోట తిని క్రికెట్ చూసుకునే వాళ్ళం!'

'ఇప్పుడేం క్రికెట్టు! అర్ధరాత్రి మద్దెల దరువు లాగ!'

'అబ్బ అర్థం చేసుకోవే గోల! మా ఫ్రెండ్సంతా కలిసి 'తెలుగుతల్లి ట్రోఫీ' మ్యాచ్‌లు చూద్దామనుకున్నాం. టిక్కెట్లు ఎవరివి వాళ్ళే కొనుక్కున్నారు. ఒక్క నలుగురు తప్ప. మనం లంచైనా ఎరేంజ్ చేయకపోతే ఏం బాగుంటుంది! పోనీ బయటికి తీసుకెడదామంటే బోలెడొదిలి పోతుంది. అసలే ఖర్చులో ఉన్నావు పాపం!'

'అఘోరించావులే! మీ అందరి పొదుపువల్లే నేనింత కూడబెడుతున్నాను!'

ఇంతలో ఫోన్ మోగింది. ఎత్తి చూశా "నేను గోపీనాథ్‌ని" అని వినబడింది.

'గోపీనాథ్ ఎవరు? ఎక్కడనించి?'

'నేనత్తయ్యా గోపీగాడిని! కావలినించే!'

'మరి గోపీనాథంటావేవిట్రా పరాయి వాళ్ళకి చెప్పినట్లు! అమ్మా నాన్న బాగున్నారా?'

'నేను ఇంకో ముగ్గురు అబ్బాయిలతో కలసి గురువారం పొద్దునకల్లా మనింటికొస్తున్నాను.' నీ దగ్గిరుంటానంటేనే పంపిస్తానంది అమ్మ. కోచ్ పర్మిషన్ ఇచ్చార్లే. శుక్రవారం మాకు మ్యాచ్ ఉంది. గెలిస్తే ఆదివారం కూడా ఉంటుంది. ఆడుతూ పాడుతూ..'

'ఇంత దూరం ఆడుతూ పాడుతూ రావడవేవిట్రా! మతిగానీ పోయిందా! అమ్మెలా ఒప్పుకుంది?'

'బావనడుగు చెప్తాడు! అమ్మ ఇరవయ్యే ఇచ్చింది. పెట్టేస్తున్నా!' మా వాళ్ళు వెనకాతలనించి ఒకటే ఇకిలింపులు.

'నీకింత జనరల్ నాలెడ్జ్ లేకపోతే ఎలాగే! ఎంతకని అన్ని విషయాలు చెప్పం! మన రాష్ట్రంలో ఇంత పెద్దఎత్తున క్రికెట్ పోటీలు 'ఆడుతూ పాడుతూ' కార్యక్రమం కింద మన ప్రభుత్వం నిర్వహిస్తుంటే నీకు దోమవాలినట్టయినా లేదు. పాపం గోపీగాడెంత చిన్న బుచ్చుకునుంటాడో!'

'వాడెందుకు చిన్న బుచ్చుకోవడం వేరే పనేమీ లేనట్లు. టెన్తులోకొచ్చి కూడా ఇంకా చదువూ సంధ్యా లేకుండా అస్తమానం బాటొకటి పుచ్చుకు తిరుగుతుంటాడని వాళ్ళ అమ్మా నాన్నకి ఒకటే బెంగ' అన్నాను.

'వాళ్ళ అమ్మకి నాన్నకీ అన్నిటికీ బెంగే. వీడింజనీరవకపోతే తెల్లవాళ్ళు దండెత్తి వస్తారా మళ్ళీను! ఆ మాట కొస్తే వాళ్ళ నాన్న మాత్రం ఇంజనీరా! అన్నిటికీ పిల్లల్నల్లరి పెట్టుకోటవే!' వెనుక నుంచి మా అత్తగారి స్టేటుమెంటు.

ఆవిడ పిల్లల్ని, అందులో ఆటల మీద ఇంట్రస్టున్న పిల్లల్ని ఏవీ అన నివ్వరు. కృష్ణా, రామా అనుకునే వయసులో ఈ ఆటలపిచ్చేవిటీ అంటే అలా అనుకోవడం చిన్నప్పుడే అయిపోయాయంటారు. టివిలో ఏ ఆటల పోటీ లొచ్చినా, ఏయే దేశాల మధ్య, గ్రహాల మధ్య జరిగినా ఆవిడ రెప్పార్పకుండా చూస్తూనే ఉంటారు. ఎవరు గెల్చినా సంతోషించి, ఎవరోడిపోయినా ఈసారి కలిసొస్తుందిలే అని ధైర్యం చెప్పుకుంటారు. ఇంటికంతటికీ పెద్దావిడ తీరే అలాగున్నప్పుడు పిల్లల సంగతి వేరే చెప్పేందుకేముంది!

ఈ 'ఆడుతూ - పాడుతూ' కార్యక్రమం మొదలై ఆరు నెలలయిందిట. రాష్ట్రంలో క్రీడలలో ఆసక్తి వున్న పిల్లల్ని ప్రోత్సహించి పోటీలు నిర్వహించి జాతీయ అంతర్జాతీయ శ్రేణి ఆటగాళ్ళని తయారుచేయాలని ప్రభుత్వం తల పెట్టిన పథకం అట. అందులో భాగంగా క్రికెట్టాటకి సంబంధించి విజయ వాడలో నెల్లాళ్ళు 12-19 ఏళ్ళ మధ్య పిల్లలకి కోచింగ్ క్యాంపు కూడా అయిం దట. మా గోపీ ఆ క్యాంపుకి సెలక్టయ్యాడని ఆ మధ్య సుగుణ చెప్పింది గానీ నేనంత పట్టించుకోలేదు. మూడు నెలల నించి అన్ని జిల్లాల జట్లు విశాఖ పట్నం, ఖమ్మం, అనంతపూరు, గుంటూరులలో ఆడి ఆడి చివరికి నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కి వచ్చాయట.అవి కృష్ణా, హైదరాబాద్, నెల్లూరు, శ్రీకాకుళం! మనూళ్ళో జరగబోయే సంబరమంతా ఆ సెమీఫైనల్, ఫైనల్ తాలూకుదన్న మాట.

మంగళవారం రాత్రి వార్తలలో చెప్పారు. రాష్ట్రంలోని విద్యా సంస్థలన్నిటికీ బుధవారం నించి నాలుగు రోజులు సెలవలని, హైదరాబాద్‌లో టోర్నమెంటు

చూడ్డానికి రాగోరే విద్యార్థులు ఆయా స్కూలు / కాలేజీ అధిపతుల నించి గుర్తింపు ఉత్తరాలు తెస్తే బస్సుల్లో సగం కన్సెషనిస్తారని, స్టేడియంలో ఉచిత ప్రవేశమని, బస్టాండులో విద్యార్థి సంఘాలని సంప్రదిస్తే వారికి వసతి ఏర్పాట్లు చేస్తారని. ఊరంతా ఒకటే హడావిడి. మంచి మంచి హోటళ్ళన్నీ పిల్లలకి హాఫ్ రేట్లకే భోజనాలు, టిఫెన్లు బోర్డులు పెట్టారు. మన రాష్ట్ర ప్రభుత్వం చీమ చిటుక్కుమంటేనే పందిరేసి పండగ చేస్తుంది కదా! మరి యువత నాకట్టుకునే ఇంత పెద్ద కార్యక్రమాన్ని సరిగ్గా కవర్ చేయకపోతే ఊరుకుంటుందా! పేపర్లన్నీ స్పోర్ట్స్ మేగజీన్లుగాను, హైదరాబాదంతా క్రికెట్ స్టేడియంగాను, వీధులన్నీ ఆహ్వాన వేదికలుగానూ మారిపోయాయి. ప్రభుత్వం స్కూలు కాలేజీ పిల్లలకి ఉచిత ప్రవేశం కల్పించింది గానీ చదువులైనా చిన్నతనాలొదలని మా పిల్లల్లాంటి వాళ్ళ దగ్గిర గోళ్ళూడగొట్టి సీజను టికెట్టుకి 250 రూపాయలు వసూలు చేసింది. రాజు తల్చుకుంటే దెబ్బలకి కొదవా! నా ఇన్నేళ్ళ వయస్సులో పిల్లల క్రికెట్టాటకి ఇంత ప్రచారం హంగామా చూడలేదు. ప్రభుత్వం వ్యాపారస్థుల్ని ఓడించేసింది ప్రచారంతో. అయినా కంపెనీల వాళ్ళూ తక్కువ తినలేదు. రక రకాల బహుమతులు గెలిచిన వాళ్ళకి, ఓడిన వాళ్ళకి, చూసిన వాళ్ళకి, విన్న వాళ్ళకి అందరికీ గుండుసూది మొదలుకొని మోటారు సైకిళ్ళ వరకు ఎడాపెడా ప్రకటించాయి. ఒక గ్రైండరు కంపెనీ వాళ్ళయితే గెలిచి గ్రైండరు సంపాదించి మీ అమ్మకి బహుమతి ఇవ్వండని ప్రకటన కూడా చేశారు. గోపీగాడు గెలిస్తే సుగుణకి కొత్త గ్రైండరు వస్తుందని సంబరపడ్డాం.

గురువారం ఏడున్నర కల్లా వచ్చేశాడు గోపీ ఇంకో ముగ్గురబ్బాయిలతో సహా. హాల్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. 'రావోయ్! రా గోపీనాథ్. వీళ్ళు నీ స్నేహితులా! రైలు టైముకే వచ్చినట్లుందే!' ఏమాటకామాట ఒప్పుకోవాలి. మా ఆయన పిల్లల్నయినా సరే చాలా మర్యాదగా పలకరిస్తారు. ఏం చేస్తాం. అది వాళ్ళ జిల్లా అలవాటు. నాకు ఒక్కసారైనా ఒరేయ్ అనకపోతే మాట్లాడినట్టే ఉండదు!

'అవును మావయ్యా. మాకిప్పుడు సిటీబస్సులో డబ్బులు కూడా తీసుకోలే. ఆదివారం వరకు మాకు అన్ని బస్సులూ ఫ్రీనే. ఇతను మా ఓపెనర్ కృష్ణప్రసాద్. ఈ అబ్బాయి మంచి బౌలరు భరద్వాజ్. ఈ సంపత్ మా పక్కవాటాలో ఉండే కృష్ణన్‌గారబ్బాయి. ఊరికే చూడ్డానికి వచ్చాడు.

'మీ టీంలో వెంకటేశ్ పేరు లేదేం? కాంప్‌లో చాలా బాగా ఆడేవాడని రాశారుగా!' అనడిగారు. ఈ దెబ్బతో పిల్లవాడుక్కిరి బిక్కిరైపోయాడనుకుంటా!

'నువ్వంత శ్రద్ధగా మా టీం పేర్లు కూడా చూశావా మావయ్యా' మా నాన్న కైతే అసలు నేరావడమే ఇష్టం లేదు. మా ప్రిన్సిపల్‌గారు చెప్తే చివరికి వప్పు కున్నారు. వెంకటేశ్‌కి జాండిశ్. అందుకే ఈసారి ఆడట్లేదు' అన్నాడు.

మేడ మీద వాళ్ళకోసం ఉంచిన గదిలో సామాన్లు పెట్టుకుని స్నానాలు చేసి, కిందకొచ్చి అన్నాలు తిని స్టేడియం కెళ్ళిపోయారు. మామూలుగా మేం ఏ పెళ్ళి కెళ్ళినా ముహూర్తం పదిన్నరకైతే చేరేటప్పటికి పదకొండున్నరవుతుంది. కేవలం భోజనాలకెళ్ళినట్టుగా ఉంటుందని నేనెంత గోలపెట్టినా ఎవరూ టైముకి తెమలరు. ఈవేళ మాత్రం తొమ్మిదింటికే అందరూ హుష్ కాకీ! రోజూ ఇలా ఉంటే ఎంత బాగుంటుంది! మొదటి సెమీఫైనల్స్ కృష్ణా - హైదరాబాద్ జట్ల మధ్య. అజరుద్దీన్ జ్యోతి వెలిగిస్తాడట. అదీ వీళ్ళ తొందర.

సిటీ కేబుల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని దాని ముందు అత్తగారు సెటిలై పోయాక నేను ఫ్యాక్టరీ కెళ్ళిపోయా! ఈ వేళ మనవాడి ఆట లేదుగా ఎవరు గెలిచినా నాకేం తేడా పడుతుంది!

సాయంత్రం ఈ కాకులన్నీ కొంప చేరేటప్పటికి ఆరున్నర దాటింది. పాపం టౌన్లలో పెరుగుతున్నారేమో ఆ పిల్లలందరూ బుద్ధిగా స్నానాలు చేసి భోజనాలకి వచ్చారు. మా వాళ్ళు ఎలా ఉన్న వాళ్ళు అలాగే. కాళ్ళు కడుక్కునే పని కూడా లేదు. డైనింగ్ టేబుల్ దగ్గిర కూచుని తినలేరు. మంచాల మీదే భోజనాలు. కాసేపు కూచుని, కాసేపు పడుకుని అలాగే. మా అమ్మ బతికుంటే ఎంత బాధ పడేదో ఈ అనాచారం చూసి. ఇంతలోకి గోపీ గొంతు వినిపించింది.

'అత్తయ్యా చూడు బావ! మేం ఎలా ఆడినా గెలుస్తామంటున్నాడు.'

'బాగా ఆడకపోతే ఎలా గెలుస్తార్రా! ఇదేవన్నా పరీక్షలా కాపీ కొట్టి పాసై పోవడానికి!'

'నీకు తెలియదు లేవే!'

'నాకు తెలియకపోతే మరేం ఫరవాలేదు గానీ ఊరికే వాడ్నేడిపించకు చిన్నవాడ్ని చేసి. అవునూ .... అసలింతకీ ఎవరు గెలిచారు ఈ వేళ?'

'అమ్మయ్య! ఇప్పటికైనా నీకు తెలుసుకోవాలనిపించింది. నువ్వసలు మనింట్లో తప్పబుట్టావే! ఒక్క ఆటలోనూ ఆసక్తిలేదు. అదే బ్యాంకుల వాళ్ళ విషయాలైతే కంఠోపాఠం.'

'అందరం అడ్డమైన దేశాల మధ్య జరిగే కుస్తీ పోటీల దగ్గిర్నించి చూస్తూ కూచుంటే పన్లెవరు చేస్తారు?'

'ఏం చెయ్యమంటావు టీవీ అయినా చూడక! నీలా అందరితో యుద్ధాలు చెయ్యాలా!' ఇంతట్లోకి అత్తగారికి కోపం వచ్చేసింది.

'సర్లే! ఇంతకీ ఎవరు గెలిచారో చెప్పనే లేదు!'

'ఇంకెవరు? మన హైదరాబాద్ వాళ్ళే. మన వాళ్ళు 40 ఓవర్లలో మూడు వికెట్లకి 160 చేశారు. కృష్ణా వాళ్ళు ఒక్క వికెట్టు పోకుండా 95 చేసి తెగ నీలిగార్లే గెలుపు తమదేనని. కానీ మా గిరి కజిన్ ప్రవీణ్ లేడూ! వాడు ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసుకున్నాడు. ఇంక ఆ తర్వాత రోల్ కాలే! 100కి 4, 105కి 5, 110కి 6, 115కి 7 చచ్చీచెడి 142 చేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కూడా ప్రవీణ్. చూస్తూ ఉండు. వాడికి రంజీ ట్రోఫీలో కూడా ప్లేసొస్తుంది!'

అంటే ప్రవీణ్ గాడి ప్రావీణ్యం వల్ల హైదరాబాద్ జట్టు ఫైనల్స్ కొచ్చిందన్న మాట.

తెల్లవారితే మా గోపీ వాళ్ళు శ్రీకాకుళం జట్టుతో ఆడాలి. ఆడే వాళ్ళకి నీరసం రాకుండా ఉండాలని పిల్లచుట్టాలందరికీ చిక్కటి పాలల్లో బోర్నవిటా కలిపి ఇచ్చాను. అది చూసి అరిచేవాళ్ళకి కూడా ఉత్సాహం తగ్గకూడదని మా పిల్లలు ఐస్‌క్రీంలు తెచ్చుకు మింగారు. కావలి పటాలమంతా తెల్లారి ఏడున్నర కల్లా గ్రౌండులో ఉండాలని చెప్పి తొమ్మిదింటికే నిద్దర్లు పోయారు.

'అత్తయ్యా! మా కోసం రేపు ఏవీ చెయ్యకు. అన్నీ అక్కడే పెడతార'ని చెప్పి మరీ పడుకున్నాడు గోపీ. ఆ మాత్రం బుర్రా, బుద్ధీ మా వాళ్ళకుంటే నాకెంత సులువుగా ఉంటుందీ! అబ్బే! నా పెంపకంలోనే ఏదో తేడా ఉంది.

పొద్దున్నే మేం ఇంకా కాఫీలు తాగుతుండగానే ఆటగాళ్ళంతా నీటుగా ముద్దుగా తయారై నుదుటి మీద విబూది బొట్లు పెట్టుకుని బామ్మ కాళ్ళ మీద పడిపోయారు దణ్ణాలు పెడుతూ!

'సరే! వీళ్ళాడుతున్నారు కాబట్టి ఏదో పెడుతున్నారనుకుందాం! నువ్వెందుకు రా నాకు దణ్ణాలు!' అని మూడోవాడ్ని అడిగారు.

'సంపత్ రోజూ బడికెళ్ళేటప్పుడు కూడా వాళ్ళ పాటికి పాద నమస్కారం చేస్తాడమ్మమ్మా లేకపోతే వాళ్ళ అప్ప అదే నాన్నగారు కోప్పడతారు.'

'నా తండ్రే మీ నాన్నకెన్ని పద్ధతులురా! హాయిగా సరదాగా ఆడుకురండి' - అన్నారు. మా అత్తగారు దీవెనలో అయినా సరే కమిటవరు.

కాసేపటికి సుగుణ ఫోన్‌చేసింది. 'వదినా! నువ్వూ అమ్మా టివిలో అయినా మనవాడి ఆట చూడండి. మీరున్నారనే నా ధైర్యం. పిల్లాడు ఎంత గోలచేసినా ఈయన నోటికి జడిసి నేను రాలేదు.'

తనంతగా చెప్పింది కదా అని నేను కూడా ఫ్యాక్టరీ కెళ్ళడం మానేసి టి.వి ముందు సెటిలైపోయాను. ఈ ఆటలు చూసేందుకు, ప్రతిభ ఉన్న పిల్లల్ని గుర్తించేందుకు బాంబే నుంచి క్రికెట్టు బోర్డు ఉన్నతాధికారులంతా ప్రభుత్వానికి ప్రత్యేక అతిథులుగా వచ్చారట. వాళ్ళని గ్రీన్‌లాండ్ గెస్టు హౌసులో ఉంచి మన వాళ్ళు రాచమర్యాదలు చేశారట. ప్రభుత్వం పూనుకుని అన్ని ఆటలకి ఇంత ప్రోత్సాహం ఇస్తే ఆడే పిల్లలూ ఉత్సాహంగానే ఆడతారు. అలాటి పిల్లల్ని అమ్మా నాన్నలు చిన్నచూపు చూడ్డమూ మానేస్తారు.

నెల్లూరు టీము టాస్ గెలిచి ఆట మొదలెట్టింది. రెండో ఓవర్లోనే వికెట్టు పడిపోయి గోపీ ఆటకొచ్చాడు. ఆ డ్రెస్సులో ఎంత బాగున్నాడో! చక్కగా ఆడి నలభై తొమ్మిది పరుగులు చేశాడు. ఇంకొక్కటి కొడితే చాలు రా దేవుడా అను కుంటుండగానే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఏమైతేనేం వాళ్ళ జట్టు 190 పరుగులు చేసింది. శ్రీకాకుళం వాళ్ళు 170కే అంతా అవుటైపోయారు. సాయంత్రం ఇంటి కొచ్చి మా టీం గెల్చింది కాబట్టి మేం మా ఫ్రెండ్స్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకోవా లని చెప్పి వాళ్ళ టీంమేట్స్ దగ్గరకెళ్ళిపోయారు - తలా జత బట్టలు తీసుకుని.

శనివారం రెండు పేపర్లలో గోపీ ఫోటో పడింది. ఇంక హైదరాబాద్ - నెల్లూరు జట్ల మధ్య తెల్లారితే ఫైనల్స్. గెలిచిన టీంలో ప్రతి ప్లేయరుకి పది వేల రూపాయలు క్యాష్, గోల్డు మెడల్. రన్నర్‌అప్‌టీంలో ప్లేయర్స్‌కి ఏడు వేల రూపాయలు వెండిమెడల్. ఇవి ప్రభుత్వం తరఫున. సరే ఇంక తెలుగుతల్లి క్రికెట్ ట్రోఫీ అందుకోబోయే అదృష్టం ఏ జిల్లాదో మరి! ఇక ఆ రోజు పేపర్లలో కంపెనీల వాళ్ళు ప్రకటించిన బహుమతులకైతే లెక్కలేదు. జీవితానికి సరిపడా షూస్, జీన్స్, కళ్ళజోళ్ళూ, షాంపులు, సైకిళ్ళు, మోపెడ్స్. ఒకటేమిటి ఒక లారీ చాలదు ఇవి మోసుకెళ్ళేందుకు.

మన ప్రయత్నం పెద్ద లేకుండానే ఆదివారం రానేవచ్చింది. పిల్ల చుట్టా లంతా ఏడు గంటలకే వెళ్ళిపోయారు అందరి శుభాకాంక్షలూ, ఆశీస్సులు అందుకుని. 'పాపం! ఇంతదూరం నుంచి వచ్చారు. మన గోపీ వాళ్ళు గెలిస్తే బాగుంటుంది కదండీ' అని మా ఆయనతో అంటే "అది సంబంధాలు కుద రడం మీదుంటుంద"న్నారు.

'ఇంత చిన్న పిల్లలకిప్పట్నించీ సంబంధాలొస్తాయా' అంటే 'నీ తలకాయ' అని నవ్వి ఊరుకున్నారు.

అత్తగారు ఆంజనేయుడికి వడమాల వేయిస్తానని మొక్కుకుని కూచు న్నారు ఆట చూడ్డానికి.

స్టేడియంలో సి.ఎం గారు పిల్లలందర్నీ అభినందించి బొకేలిచ్చి వెళ్ళి పోయారు కాబినెట్ మీటింగుందని. ఆ వేళ టివిలో హీరోలు మాత్రం సచిన్, అజయ్, కుంబ్లేలు. కెమేరా వాడు నిమిషం ఆట చూపిస్తే రెండు నిమిషాలు వాళ్ళని చూపించాడు.

నెల్లూరు వాళ్ళదే బ్యాటింగ్, టాస్ హైదరాబాద్ గెలిచినా. వాళ్ళు శ్రీగణేశా అంటూనే నో బాలు. ప్రవీణ్‌కి వేలు మడత పడింది. బౌలింగ్ చేయడని తెలిసింది. బౌండరీ దగ్గిర ఫీల్డింగ్ చేస్తూ కనిపించాడు. మొన్నటికి మొన్న సెమీ ఫైనల్స్‌లో అంతబాగా ఆడిన జట్టుకేమైందో ఒకటే లూజ్ బాల్స్. నెల్లూరు వాళ్ళు నలభై ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి పదకొండు వైడ్స్, 18 నోబాల్స్‌కి సమాధానంగా 20 ఫోర్స్, 5 సిక్సర్ల సాయంతో 210 పరుగులు చేశారు. గోపీ నాటవుట్ 73, స్టేడియం అంతా ఒకటే అల్లరి. ఇంకేముంది నెల్లూరు జట్టు ట్రోఫీ తీసుకుపోతుందని హైదరాబాద్ వాళ్ళ ముఖాలు వాడిపోయాయి. కెప్టెన్ కేమైనా దయ్యం పట్టిందా! అడ్డమైన వాళ్ళ చేత ఈ బౌలింగేమిటి! ఆ ఫీల్డింగ్ ఏమిటి? కుర్రాళ్ళు ఈలలు. బయటకి రండ్రా! మీ పని చేస్తాం అని అరుపులు. ఆ క్రౌడ్‌ని కంట్రోలు చెయ్యడానికి పోలీసులు కలుగజేసుకోవలసి వచ్చింది. లంచ్ టైంలో మా వాడి ఫోను 'నే ముందే చెప్పాగదే! వీళ్ళెలా ఆడినా గెలు స్తారని. నా ఫోర్ కాస్ట్ అంటే మజాకానా!'

ఉత్సాహంగా చాలామంది తోసుకు వచ్చి నెల్లూరు కెప్టెన్‌ను అభినందిం చడం మొదలుపెట్టారు. కొంతమంది పెద్దలు అతనికి ఎలా ఆడాలో జాగ్రత్తలు చెప్పి చెప్పి వెళ్ళారు. స్టేడియంలో చీమ చిటుక్కుమనేంత నిశ్శబ్దం. అందరికీ విపరీతమైన టెన్షన్. వీళ్ళు గెలవాలంటే 211 పరుగులు చేయాలి. ఐదారుగురు మంచి బ్యాట్స్‌మన్‌లు ఉన్నారు. మరీ అంత అసాధ్యమైన టార్గెటేం కాదు. కానీ నెల్లూరు వాళ్ళ మర్యాదల పర్వం మొదలైంది. హైదరాబాద్ వాళ్ళిచ్చిన ఆతిథ్యం మరిపించేలా నోబాల్స్, లూజ్‌బాల్స్, వైడ్స్ వడ్డించడం మొదలు పెట్టారు. నంజుకోవడానికి మధ్యలో రెండు మూడు 'క్యాచ్ డ్రాపులు.' మా గోపీ మంచి బ్యాట్స్‌మెన్ అని తెలుసుగానీ బౌలింగ్ వచ్చని తెలియదు. వీడ్ని

పిలిచి బౌలింగ్‌కి పంపాడు వాళ్ళ కెప్టెన్. కొంచెం తెల్లముఖం పెట్టినా ఆల్ రౌండర్‌గా పేరు తెచ్చుకోవచ్చుననుకున్నాడో ఏమో వీడు ఉత్సాహంగా ఎగురు కుంటూ బౌలింగ్‌కి వెళ్ళాడు. ఒక్కో ఓవర్‌కి 11, 13 పరుగులివ్వడంతో జనాల్లో ఈలలు మొదలయ్యాయి. మళ్ళీ వెనక్కి పిల్చి ఇంకోడ్ని పంపారు. ఇంతలోకీ ఈయన గొంతు వినబడింది.

'ఇదిగో! కాఫీ పట్రా! విజయలక్ష్మి ఇద్దరికీ నచ్చినట్లు లేదు. స్వయం వరానికి వచ్చి మరి ఎవరో ఒకరు దండ వేయించుకోక తప్పదు!'

పొద్దున్నుంచి హైదరాబాద్ వాళ్ళ బౌలింగ్ చూసి విస్తుబోతే మధ్యాహ్నం నుంచి నెల్లూరు వాళ్ళ బౌలింగ్ చూసి మతులుపోయాయి. జనం అంతా అయోమయంలో పడి ఏం జరుగుతుందో తెలియక ప్రతి బాల్‌కీ అరవడం మొదలుపెట్టారు. గెలవటం అయితే ఎవరికీ ఇష్టం లేనట్లుంది. టైమున్నా రన్ తీసుకునేందుకు వీళ్ళు కక్కుర్తి పడరు. పరిగెత్తే బాల్‌ని ఆపేందుకు వాళ్ళు తాపత్రయపడరు. ఎలా జరగాల్సింది అలా జరుగుతుందిలే అన్నట్లు ఆట. క్రికెట్టంటే పెద్ద పరిచయం లేని నాకే అంతా అపసవ్యంగా ఉందని తెలిసి పోతోంది.

చూస్తుండగానే 37 ఓవర్లయి 190 పరుగులయ్యాయి. ఇంక మూడు ఓవర్లలో 21 పరుగులు చేస్తే హైదరాబాద్ వాళ్ళు, లేకపోతే నెల్లూరు వాళ్ళు గెలుస్తారు. రెండే వికెట్లు మిగిలాయి. లోకల్ టీంని ఉత్సాహపరిచేందుకు ఆడియన్స్‌లో డప్పుల వాయిద్యాలు మొదలయ్యాయి. ఒకటే అల్లరి గోల! పోలీసు బందోబస్తు ఎక్కువ చేశారు. ఇంక రెండు ఓవర్లున్నాయనగా సి.ఎం గారు, మిగతా విఐపిలు వచ్చారు. హైదరాబాద్ వాళ్ళు సిక్సర్ కొట్టే ప్రయ త్నంలో ఉండగా పైకి లేచిన బంతిని నెల్లూరు వైస్ కెప్టెన్ స్వయంగా డ్రాప్ చేశాడు. అది నిదానంగా నడుచుకుంటూ బౌండరీ దాటింది. అలా రెండు నాలుగు లొచ్చేటప్పటికి హైదరాబాద్ వాళ్లు గెలవక తప్పదని తేలిపోయింది. ఇద్దరు రోగులూ నీళ్ళే కోరినా ఒకళ్ళకి పాలు తాగక తప్పలేదు. గెలిచే టీంలో కొందరి ముఖాల్లో కళే లేదు. నెల్లూరు టీం కెప్టెన్ ముఖంలో ఏ భావమూ లేదు. నిమ్మకు నీరెత్తినట్టుగా ఆడుతున్నాడు. చివరికి హైదరాబాద్ జట్టు గెలి చింది 211 పరుగులు చేసి. ముఖ్యమంత్రి గారందరికీ ట్రోఫీలు, చెక్కులు, మెడల్స్ అందించారు. ముఖ్య అతిథి అయిన బోర్డు ఉన్నతాధికారి మాట్లా డుతూ దేశానికి పేరు తేగల మెరికల్లాంటి కుర్రాళ్ళని ఈ ఆటల సందర్భంలో

తాను చూశాననీ, ఆటని కన్నతల్లిలా భావించి గౌరవించి వచ్చిన అవకాశాలని సద్వినియోగం చేసుకోవాలని పిల్లలకి హితవు పలికారు. బహుమతులు, మెడల్స్, చెక్కులు అందుకుని పిల్లలు సాయంత్రం ఇంటికి చేరారు. అప్పుడు విప్పాడు గోపీ నోరు!

'ఏం బావా? మేం ఎలా ఆడినా గెలుస్తామన్నావుగా! గెలవలేదేం మరి!'

'పిచ్చి నాయనా! తాడి తన్నేవాడి తల తన్నేవాడుంటాడ్రా! నీకు - నీ ప్రశ్నకి సమాధానం మీ ఊరెళ్ళాక తెలుస్తుందిలే. లంచ్ అంటే తిని కునకడం అను కుంటున్నావా! ఊరికే ఏడవకుండా ఫైజులన్నీ జాగ్రత్తగా చూసి సద్దుకో. వెళ్ళి రారా గోపిబావా!'

**23-7-1999, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక**

✦ ✦ ✦